క్లుప్తంగా

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం



ఆలయ అధికారులకు విరాళం అందజేస్తున్న బెంగళూరు వాసులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు మంగళవారం విరాళాల రూపంలో రూ.2లక్షలు అందింది. బెంగళూరుకు చెందిన చేతన్ రెడ్డి, రమణారెడ్డి రూ.లక్ష చొప్పున ఆలయ అధికారులకు విరాళం అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

యాదమరి: గుట్టకిందపల్లె ఆరోగ్య ఉపకేంద్రం వద్ద మంగళవారం యాదమరి ప్రభుత్వాస్పత్రి వైద్యులు వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రజలు, కూలీలు, ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4గంటలకు తర్వాత పొలాలలో పనులు చేసుకోవడం మంచిదని సూచించారు. వడదెబ్బ లక్షణాలను తెలియజేశారు. ఎవరైనా వడదెబ్బ బారిన పడితే ఆస్పత్రిలో చికిత్స పొందాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు గిరింపేటలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలోని ఈ కేంద్రంలో వృద్ధులకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురు వైద్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఏపీపీగా స్వాతి నియామకం



స్వాతి



గోవిందుడు

చిత్తూరు అర్బన్: చిత్తూరు అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా న్యాయవాది ఏ.స్వాతిని నియమిస్తూ రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరుకు చెందిన ఈమె మూడేళ్ల పాటు ఏపీపీగా కొనసాగనున్నారు. అలాగే ఆర్డీవో, జేసీ కోర్టుల్లో జరిగే సివిల్ కేసులకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (జీపీ)గా గోవిందుడు సాంబశివుడు సైతం నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.

మార్కెట్ల వేలం.. పంచాయతీకి ఆదాయం

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీకి వారపు సంత వేలంలో రూ.5.5 లక్షలు ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ వాణిప్రియ, గ్రామ కార్యదర్శి దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో 2024– 25 సంవత్సరానికి గాను దినసరి, వారపుసంత బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు చెప్పారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.1.65లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

బంగారుపాళెం: గంజాయి విక్రేతను మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ లక్షుమయ్య తెలిపారు. ఆయన కథనం..బంగారుపాళెం పోస్టాఫీసు వీధిలో నివాసముంటున్న అంజాద్‌ఖాన్(39) దళితవాడ సమీపంలో వినాయకుని గుడి వద్ద గంజాయితో ఉండగా తహసీల్దార్ సుభద్రమ్మ ఆధ్వర్యంలో బంగారుపాళెం సీఐ, సిబ్బంది పట్టుకున్నారు. అతని నుంచి రూ.12 వేల విలువైన 2కిలోల 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశారు.

పంటలపై ఏనుగుల దాడి



సదుం: మండలంలోని నాయినివారిపల్లె అటవీ ప్రాంతంలోని పంటలపై ఏనుగులు దాడి చేసి నష్టం కలిగించినట్లు రైతులు మంగళవారం ఉదయం గుర్తించారు. రాజేశ్వరమ్మ, మల్లికార్జునకు చెందిన వరి పంటను తొక్కివేశాయి. సుబ్బయ్యకు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. వాసుదేవరెడ్డికి చెందిన ప్రహరీ గోడను ధ్వంసం చేశాయి.

బాలిక అదృశ్యం

గంగవరం: మైనర్ బాలిక అదృశ్యంపై గంగవరం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. సీఐ చిన్నగోవింద్ కథనం.. మండలంలోని పత్తికొండకు చెందిన బాలిక గత ఏడాది పదవ తరగతి పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి ఆమె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిట్టించడం.. కొట్టించడమే టీడీపీ అజెండా

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి
- జగనన్నతోనే అభివృద్ధి
- నాయనిచెరువులో పల్లెబాట



పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: ప్రభుత్వాన్ని తిట్టించడం, సామాన్య ప్రజలను కొట్టించడమే టీడీపీ ప్రధాన అజెండాగా మారిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి దుయ్యబట్టారు. మంగళవారం చిత్తూరు మండలం నాయని చెరువు పంచాయతీలో ఆయన పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం పరితపించారన్నారు. పలు సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ రూ.3నుంచి రూ.లక్షల లబ్ధి చేకూరిందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు ఇంటింటికీ అందేలా చేశారన్నారు. కరోనా విపత్తు సమయంలో రాష్ట్రానికి సీఎం రక్షణ కవచంలా నిలిచారని గుర్తు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సభలు, సమావేశాల్లో సీఎం, వైఎస్సార్‌సీపీ శ్రేణులను తిట్టించడం, సామాన్య ప్రజలను కొట్టించడమే ఎన్నికల అజెండాగా టీడీపీ ముందుకు వెళుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే పంతంతో చంద్రబాబునాయుడు అడ్డదారుల్లో కదం తొక్కుతున్నారన్నారు. అదే రీతిలోనే తమ్ముళ్లు కూడా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నీచరాజకీయాల్లో చంద్రబాబుకు సాటివ్వరు లేరని విమర్శించారు. సంక్షేమం కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి వచ్చేలా మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎంఎస్ బాబు నాయుడు, వైస్ ఎంపీపీ జయరాం, రంజని, పార్టీ మండల కన్వీనర్ త్యాగరాజులు, సర్పంచ్ సులోచన, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, సంపత్, వెంకటేష్, లోక, రామూర్తి, జయపాల్, భాస్కర్‌రెడ్డి, మణిబాబు,ప్రతిమారెడ్డి, దేవేంద్ర, కుమార్, కామరాజు, నంద, తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయకుంటే జీతాల నుంచి రికవరీ



చిత్తూరు కార్పొరేషన్: మాట్లాడుతున్న ఎస్‌ఈ

చిత్తూరు కార్పొరేషన్: మెటీరియల్ డ్రా చేసి పనులు చేయకుండా ఎందుకు పెండింగ్‌లో పెట్టుకుంటున్నారని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయంలో జరిగిన సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టోర్స్ నుంచి మెటీరియల్ తీసుకున్నా, క్షేత్రస్థాయిలో పనులు ఎందుకు చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పనులు పూర్తయిన వెంటనే నివేదికలు పంపాలన్నారు. 2019–2020 వరకు పెండింగ్‌లో ఉన్న వర్క్‌ఆర్డర్లను పదిరోజుల్లో క్లోజ్ చేయకపోతే ఏఈ, డీఈల జీతాల నుంచి రికవరీ చేస్తామని హెచ్చరించారు. వీటిపై పలు మార్లు హెచ్చరించినా ఎటువంటి మార్పు లేదన్నారు. సబ్‌స్టేషన్ల నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాలని తెలిపారు. ప్రతి నెలా వందశాతం రెవెన్యూ సాధించే విధంగా పనిచేయాలన్నారు. బిల్లులు కట్టని ప్రైవేటు సర్వీసులకు సరఫరా ఆపివేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ హరి, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్

తవణంపల్లె: వేసవిలో అంతరాయం కలుగకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈ ఎం. కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని అరగొండ, పైపల్లె, కాణిపాకం సబ్‌స్టేషన్లను తనిఖీ చేశారు. వేసవిలో వ్యవసాయ రంగానికి సంబంధించి కరెంటు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆదేశించారు. అలాగే, పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ బిల్లులు వసూలు చేసి సంస్థకు ఆదాయం పెంచాలన్నారు. వ్యవసాయానికి ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే 3 ఫేజ్‌లో కరెంటు సరఫరా చేయాయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ హరి, ఏడీఈ సుబ్రమణ్యం, అరగొండ, పైపల్లె, కాణిపాకం ఏఈలు క్రిష్ణకిషోర్, కిరణ్, బాలాజి, సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ పక్కాగా అమలు చేయాలి



సూచనలిస్తున్న ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అమలుకు నియమించిన అన్ని బృందాలు సకాలంలో స్పందించాలని ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధుల్లో పాల్గొననున్న అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు నంబర్లను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు రిపోర్టులను అందజేయాలని సూచించారు. వెబ్ కాస్టింగ్ నెట్వర్క్‌లకు సంబంధించి ఏర్పాట్లను సరి చూసుకోవాలని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించి రెండు గంటల్లో స్పందించి వాటిని పరిష్కరించి, నివేదికను పంపాలని తెలిపారు. అలాగే సింగిల్ విండో విధానంలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ అరుణ, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పులివెందులకు దీటుగా కుప్పం అభివృద్ధి



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీనివాసులు

కుప్పం రూరల్: కుప్పంలో తనను గెలిపించి ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇస్తే పులివెందులకు దీటుగా కుప్పాన్ని అభివృద్ధి చేసి చూపుతానని కుప్పం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని రాజీవ్‌కాలనీలో ఆయన జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌తో కలిసి ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. ఫ్యాను గుర్తుపై ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. ప్రజలతో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ఇన్నేళ్లు మోసపూరిత హామీలు, పేపర్లపై అభివృద్ధి చూపి జనాన్ని మోసం చేశారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతిపక్ష నాయకుని నియోజక వర్గమని వివక్ష చూపక పలు అభివృద్ధి పనులు చేశారని వాటి గురించి వివరించారు. అందరికీ అందుబాటులో ఉన్నదెవరో, తెలంగాణలో ఉంటూ ఊసరవెల్లి రాజకీయాలు నెరపుతున్నదెవరో ప్రజలు గుర్తెరిగి ఓటును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలోచించి జగనన్న ప్రభుత్వంలో మేలు జరిగింటే తమకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగరాజు, కుమ్మరేష్, రత్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.

25న వారపు సంత వేలం

గంగాధర నెల్లూరు: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు జీడీ నెల్లూరు గ్రామ పంచాయతీ వారపు సంత, షాపింగ్ కాంప్లెక్స్ రూముల నిర్వహణ కోసం ఈనెల 25వ తేదీ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి అంజాద్ బాషా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారపు సంత నిర్వహణ కోసం రూ.1,25,000 ధరావత్తు సొమ్ముగా చెల్లించాలన్నారు. అదేవిధంగా షాపింగ్ కాంప్లెక్స్ రూముల కోసం రూ.10000 డీడీ రూపంలో పంచాయతీ కార్యాలయంలో 25వ తేదీ 11 గంటల్లోపు డిపాజిట్ చెల్లించి తగు రశీదులు పొంది వేలంలో పాల్గొనచ్చని తెలిపారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



కవాతు చేస్తున్న పోలీసు బలగాలు

పాలసముద్రం : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం మండల పరిధిలోని గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ డీఎస్పీ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చనే భరోసా ఇచ్చేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

సేవ ఉన్నతం..టీడీపీ తీరు నీచం



ఎన్‌వీజీ ఫౌండేషన్ పంపిణీ చేసిన రైటింగ్ ప్యాడ్లపై కేవలం వెంకటేగౌడ ఫొటో మాత్రమే ఉన్న దృశ్యం(ఫైల్)

- ఎన్‌వీజీ ఫౌండేషన్ రైటింగ్ ప్యాడ్లపై నానాయాగీ
- టీడీపీ నేతలపై మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పలమనేరు: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి గ్రేడింగ్‌తో ఉత్తీర్ణులై ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఏటా ఎన్‌వీజీ ఫౌండేషన్ రైటింగ్ ప్యాడ్లను అందజేస్తోంది. ఈ ఏడాది సైతం పలమనేరు నియోజకవర్గంలోని హైస్కూళ్లలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు దాదాపు 30వేల పైచిలుకు రైటింగ్ ప్యాడ్లను పంపిణీ చేసింది. ఆ ప్యాడ్లపై ఎమ్మెల్యే వెంకటేగౌడ చిత్రంతో 'ఉన్నత శిఖరాలే మీలక్ష్యం' ఎన్‌వీజీ ఫౌండేషన్ అని ప్యాడ్లపై చిన్న అక్షరాలతో ముద్రించి ఉంది. పదేళ్లుగా ఫౌండేషన్ ఈ సేవ చేస్తోంది. రైటింగ్ ప్యాడ్ల మీద ఎక్కడా వైఎస్సార్‌సీపీ అని గానీ, ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలేవీ లేవు. ఇన్నేళ్లుగా పరీక్షల్లో చాలామంది వీటినే వాడారు. అయితే ఈ పర్యాయం ఆ ప్యాడ్లతో పబ్లిక్ పరీక్షలకు వచ్చిన విద్యార్థులకు టీడీపీ నేతల తీరు మూలాన చేదు అనుభవం ఎదురైంది. ఎన్నికల నిబంధనలు పాటించడం లేదంటూ అధికారులకు ఫిర్యాదు చేసి హంగామా చేశారు. దీంతో కొన్ని పరీక్ష కేంద్రాల్లో ఈ ప్యాడ్లను అనుమతించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. ఇక, పనికట్టుకుని పచ్చపత్రికలు కూడా కోడ్ ఉల్లంఘన అంటూ ఓవరాక్షన్ చేశాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా పిలకాయలకు ఏమైనా ఓటు హక్కు ఉందా? ప్యాడ్లు ఇచ్చినారు కదా అని వాళ్లేమైనా ఓట్లేపిస్తారా?.. కొంచెమైనా బుద్ధీ జ్ఞానం ఉండాలి..మీరు ఇవ్వరు..ఎవరైనా ఇస్తే ఓర్చుకోలేరు..పదో తరగతి పరీక్షలు రాసే పిలకాయలను కూడా మీ దరిద్రపు రాజకీయాలతో ఇబ్బంది పెడతారా?'అని టీడీపీ నేతలను శాపనార్థాలు పెట్టారు. ఇదలా ఉంచితే, టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు స్థానిక ఆర్డీఓ మనోజ్‌రెడ్డి పట్టణంలోని టెన్త్ పరీక్ష కేంద్రాలకు వెళ్లి తమ సిబ్బంది ద్వారా విద్యార్థుల నుంచి ఎన్‌వీజీ ప్యాడ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకూడదు



పాల్గొన్న సచివాలయాల సిబ్బంది



మాట్లాడుతున్న ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు

- అసెంబ్లీ నియోజకవర్గ ఆర్‌ఓ శ్రీనివాసులు
- సచివాలయాల సిబ్బందితో సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు రాజకీయ పార్టీల ఒత్తిడికి లొంగకూడదని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చిత్తూరు నగరంలోని 26 నుంచి 50వ వార్డులకు సంబంధించి సచివాలయ సిబ్బందితో ఎన్నికల కసరత్తుపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు పక్కా గా ఉండాలన్నారు. కేంద్రంలో తప్పనిసరిగా ఆర్‌ఓ,ఏఆర్‌ఓ, సెక్టోరల్ అధికారి, బీఎల్‌ఓ, స్థానిక ఎస్‌ఐ ఫోన్ నంబర్లను, పోలింగ్ కేంద్రం నంబర్, నియోజకవర్గ నంబర్‌ను పెయింట్‌తో రాయించాలన్నారు. రెండు రోజుల్లో ఆ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీ సమావేశాల్లో పాల్గొనకూడదన్నారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం పరిధిలో పనిచేస్తున్నామన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. ఏ పార్టీకి గాని, ఏ వ్యక్తికి గాని సచివాలయ సిబ్బంది పని చేయకూడదన్నారు. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలున్నట్లైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. చిత్తూరు ఏఆర్‌ఓ, చిత్తూరు నగరపాలక కమిషనర్ అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ పచ్చ ప్రచారాన్ని ఏమంటారు?



గుడిపాల: గోడపై దర్శనమిస్తున్న టీడీపీ ప్రచార చిత్రాలు



తుమ్మలవారిపల్లె వద్ద ..

గుడిపాల: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నాలుగురోజులు గడుస్తున్నా మండలంలో తెలుగుదేశం పార్టీ ప్రచార బోర్డులు ఇంకా దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ప్రజలు 'మా నమ్మకం నువ్వే జగన్' బోర్డులను స్వచ్ఛందంగా పెట్టుకున్నా టీడీపీ నాయకులు నానా హంగామా చేసి అధికారుల ద్వారా తీయించారు. అయితే తుమ్మలవారిపల్లె, గుడిపాల, పానాటూరు ప్రాంతాల్లో గోడలకు పసుపురంగులు వేయించి రాయించిన టీడీపీ ప్రచార బోర్డులను మాత్రం అలాగే ఉంచేశారు. దీనిపై జనం మండిపడుతున్నారు. నీతులు టీడీపీ వారికి వర్తించవా, అధికారులకైనా కనిపించవా అంటున్నారు.

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



గుడిపాల: సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది



తవణంపల్లె: మత్యంలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ప్రజారోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని మత్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో47 మంది రోగులకు, గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఆసుపత్రిలోనే ప్రసవించడం మంచిదని, ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవాలని గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యంరెడ్డి, తులసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరువారంపల్లెలో..

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలన్నాదే ఫ్యామిలీ డాక్టర్ ఉద్దేశమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కుప్పిగానిపల్లెలో..

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి రష్మిత అన్నారు. మంగళవారం కుప్పిగానిపల్లె ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, షుగర్ పేషెంట్‌లకు వైద్య చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు. మొత్తం 66 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పికి గాయాలు



దుప్పికి చికిత్స అందిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని ఎర్రగుంట సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి జనారణ్యంలోకి వచ్చిన ఓ చుక్కల దుప్పి కుక్కల దాడిలో గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. ఎర్రగుంట గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి మంగళవారం ఉదయం ఓ చుక్కల దుప్పి వచ్చింది. అయితే కుక్కలు గుంపుగా దుప్పిపై దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు గమనించి కుక్కల బారి నుంచి దుప్పిని రక్షించారు. గాయపడిన దుప్పిని రామచంద్రాపురం మండలం కుప్పంబాదూరు పశువైద్యశాలకు తరలించి వైద్యం అందించారు. పశువైద్యాధికారులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి దుప్పిని తీసుకెళ్లి అడవిలో వదిలేశారు. ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామి దగ్గర ఉండి దుప్పికి వైద్య సేవలు అందించి కాపాడారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

తవణంపల్లె: ఓటు హక్కు కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని, సమర్థవంతమైన వారిని ఎన్నుకునేందుకు ఇదొక ఆయుధమని ఏపీఎం రవి అన్నారు. ఓటు హక్కుపై మంగళవారం తవణంపల్లె గ్రామ సమాఖ్య సభ్యులతో ఆయన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రలోభాలకు గురికారాదన్నారు. ర్యాలీలో సీసీ ప్రకాష్, గ్రామ సమాఖ్య లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం కల్పలతా రెడ్డి కోరారు. ఓటు హక్కుపై సంఘమిత్రలతో కలసి మంగళవారం కొటాలలో ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘమిత్రలు, మహిళలు పాల్గొన్నారు.



పాపసముద్రంలో అవగాహన ర్యాలీ

వినియోగించుకోవాలి

గుడిపాల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇందిరాక్రాంతి ఏపీఎం సుధారాణి తెలిపారు. మంగళవారం పాపసముద్రంలో మహిళా సంఘ సభ్యులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈవీఎంలలో ఓటును ఎలా వేయాలో వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెలుగు సీసీ హేమచంద్రారెడ్డి, సంఘమిత్ర లావణ్య పాల్గొన్నారు.





తవణంపల్లె: అవగాహన ర్యాలీలో గ్రామ సమాఖ్య సభ్యులు, యాదమరి: కొటాలలో..